సముద్రం నీలంగా ఉంటుంది. ఆకాశం ప్రతిఫలించి, మధ్యాహ్నం పూట మరింత నీలంగా దూరాన ఆకుపచ్చగా ఉంటుంది. తీరాన నిలబడి చూస్తోంటే చైతన్యం ఉబికి, కెరటాలూ వచ్చి విరిగి, నురుగులుగా వెనక్కి పరుగెడుతుంది. ఎంతో విస్మయం గొలుపుతుంది. ఆశ్చర్యమూ, భయమూ కలుగుతాయి. ఆ దృశ్యం నుంచి వెనక్కి తిరిగి ఎదురుగా చూస్తే తెల్లని యిసుక, ఆ చివర దిబ్బలుగా పేరుకున్న ఇసుక కనిపిస్తాయి. అంతా నిర్మానుష్యం. కానీ ఆ ఇసుక దిబ్బల కింద దూరదూరంగా తవ్విన గోతులు కనుపిస్తుంటాయి. కొన్ని గోతులలో ఆడమనుష్యులుం టారు, బతికివున్నవాళ్లే. నిర్మానుష్యమైన ఆ ప్రదేశంలో గోతులెం దుకు తవ్వారు? వాటిలో మనుష్యులుండట మేమిటి?

# “కాలే పొట్టా? కాదు, వీపు!


- తురగా జానకీరాణి



చాలా మందికి అర్థం కాని విషయం. ఆడవాళ్లు అక్కడ తమ పని తాము నిర్వర్తించుకుంటున్నారు. ఒంటరిగా కాదు, తమ కోసం వచ్చిన పురుషులను సంతృప్తిపరుస్తున్నారు.

సముద్రతీరం బహిరంగప్రదేశం. ఇసుక కాలిపోయి వొళ్లు మండిపోతుంది. కానీ గోతుల్లో అయితే నల్లని మట్టి వుంటుంది. అంతగా వేడెక్కకుండా కొంత భాగమైనా చల్లగా వుంటుంది. ఐనా ఆ ఆడవాళ్లనే అడగాలి. ఎంత బాధ, ఎంత లాభం, ఎంత గౌరవం. అగౌరవం-దాపరికం ఎంత-దాక్కోనేది ఎంత అని తెలుసుకోవాలంటే వాళ్లనే అడగాలి.

కానీ మాట్లాడ్డానికి తీరుబాటు వుందా వాళ్లకి-ఓపిక వుందా- సాయంత్రం నాలుగు లోపు వాళ్ల పిల్లలు ఇళ్లకి వచ్చేసరికి ఈ పని ముగించుకొని, కొన్ని పైసలు చేతుల్లో పడేయించుకొని ఇంటికి పోవాలి. తమ 'ఉదర'పోషణార్థమే కాక బిడ్డల కడుపులు నింపడం కోసం కూడా వారీ పని చేస్తారు.



ఆమెకు అలమేలు అని అమ్మవారి పేరు పెట్టినప్పుడు తల్లి. తండ్రి అనుకుని వుండరు, గోతుల్లో శృంగారానికి లోనవుతున్న జీవితంలో తమ కూతురు పడిపోతుందని వారు ఊహించి ఉండరు. అటువంటి భవిష్యత్తే ఆమెకు వ్రాసి వుంటే ఆ నాడే గొంతు నులిమిపడేసేవారేమో!

అలమేలు ఏడు వరకు చదువుకొంది. ఆరులో ఉండగానే పెద్ద మనిషైంది. ఖాళీగావున్న మగపిల్లలు ఆమె వెంట పడటం మొదలు పెట్టారు. పొద్దున్న పాలపాకెట్టుకి వెళ్లడంతో ఆరంభమై కూరకి వెళ్లినా వాకిలి ఊడ్చి ముగ్గులేస్తున్నా-ఆకతాయి కుర్రవాళ్ల బెడద తప్పలేదు. తల్లి, తండ్రి బైటపనులకు వెడతారు. మింగేటట్లు చూసే పోకిరీ కుర్రాళ్ల, మధ్య వయస్సు మగవాళ్లనుంచి అలమేలుని ఎలా కాపాడాలో తెలియలేదు అమ్మకీ, నాన్నకీ.

ఒక రోజు బస్సులో కూచోపెట్టి మామయ్యగారింటికి వెళ్లి నెల రోజులుండిరా అని పంపించారు. ఆ కాసిని రోజులైనా ఆమెను కాపాడే బాధ్యత తప్పుతుందని. బెదురు కళ్ల అలమేలు దిక్కులు చూస్తున్న తీరు ఒక మగాడిని ఆకర్షించింది. రెండు గంటల ప్రయాణం. పది రూపాయలిచ్చాడు నాన్న, ఎందుకైనా మంచిది ఉంచుకొమ్మని. ప్యాసింజరు బస్సు మూడు చోట్ల ఆగుతుంది. మొదటిసారి ఆగినప్పుడు చాలా మంది దిగారు కిందికి. ఆ మగవాడూ దిగాడు. సోడా తాగి, సిగరెట్టు వూది, తిరిగి బస్సు ఎక్కేటప్పుడు అలమేలు ను పరీక్షగా చూశాడు. కాస్సేపటికి అలమేలు వెనక్కి తిరిగి చూసేటప్పటికి, అతను ఆమె వేపే చూస్తున్నాడు. తెల్ల పంచె, సిల్కు లాల్చీ, మంచి ఫ్రేమ్ కళ్లద్దాలు సినిమా హీరోలాగా కనపడ్డాడు ఆమె కళ్లకి. తనవేపే తదేకంగా చూస్తూ, చిరునవ్వు విసిరిన అతన్ని మళ్లీ మళ్లీ చూడాలనిపించింది.

ఆమెకు అలమేలు అని అమ్మవారి పేరు పెట్టినప్పుడు తల్లి, తండ్రి అనుకుని వుండరు, గోతుల్లో శృంగారానికి లోనవుతున్న జీవితంలో తమ కూతురు పడిపోతుందని వారు ఊహించి ఉండరు. అటువంటి భవిష్యత్తే ఆమెకు వ్రాసి వుంటే ఆ నాడే గొంతు నులిమిపడేసేవారేమో! అలమేలు ఏడు వరకు చదువుకొంది. ఆరులో ఉండగానే పెద్ద మనిషైంది. ఖాళీగావున్న మగపిల్లలు ఆమె వెంట పడటం మొదలు పెట్టారు.

రెండోసారి బస్సు ఆగినపుడు దిగుతున్న జనం లోంచి కొంచెం పక్కకు తప్పుకొని. "కాఫీ ఇప్పిస్తాను రా, దిగు" అన్నాడు.

అలమేలు బిత్తరపోయింది. "వద్దు-వద్దు..."

"డబ్బులు లేకపోతే పరవాలేదు రా" అన్నాడు.

"నా దగ్గర డబ్బులున్నాయి" అన్నది.

"ఉంటే దాచుకో, దిగు" అన్నాడు.

ఆడవాళ్ల సీటులో ఉన్న ఒకరిద్దరు దిగిపోయారు. మిగతావారు పళ్లు, బజ్జీలు, సోడాలు అమ్మేవారితో బేరాల్లో పడ్డారు. అంచేత అలమేలు ఈ కొత్తమనిషితో మాట్లాడినవి ఎవరూ పెద్దగా పట్టించు కోలేదు. వాళ్లిద్దరూ చుట్టాలో, పరిచితులో అని కూడా అనుకుని ఉండొచ్చు.

అలమేలు తన సంచీ చేత్తో పుచ్చుకునే దిగింది.

చిన్న హోటలు, లోపల నాలుగు బెంచీలు, కుర్చీలు. ఆడవాళ్లకు ఒకరిద్దరు బయట దూరంగా నుంచుని టీలు తాగుతున్నారు.

అలమేలుని తీసుకెళ్లిన ఆయన లోపలకు నడిచాడు. వెనకాల బెంచీల్లో ఒకటి ఖాళీవుంది. అలమేలుని కళ్లతోనే ఆహ్వానించి అక్కడ కూర్చోపెట్టాడు.

"ఆకలేస్తోందా?" అన్నాడు. గుబురు మీసాలు, నొక్కుల క్రాఫింగు.

అలమేలుకి నిజంగానే ఆకలేస్తోంది. "ఊహు" అన్నది. రెండు పేట్లు వడ తెప్పించి పెట్టాడు. ఆ పచ్చడి, సాంబారు జన్మలో రుచి చూడనట్లు తిన్నది ఆమె. కాఫీ వచ్చింది. ఎవ్వరూ ఎప్పుడూ తనని ఆదరించి పద్ధతిగా కప్పులో కాఫీ పోసి ఇవ్వలేదు. అంత మంది మగవాళ్లమధ్య కూర్చోడం, ఎవ్వర్నీ తగలకుండా నడవడం అన్నీ కొత్తే. వక్కపొడి కొని నములుతూ, సిగరెట్టు అంటించుకున్నాడు. అలమేలు బెంచీలు, బల్లలు దాటి, మగవారిని తప్పించుకుంటూ బయటకు వచ్చింది.

విలాసంగా గాలిలో పొగ వూదుతూ ఆయన "అదుగో మన బస్సు వెళ్లిపోతోంది" అన్నాడు. అలమేలు పరిగెత్తబోయింది. కంగారుగా "పిలవండి, పిలవండి" అన్నది. బస్సుకి వినిపిస్తుందా?

తాపీగా వెనక్కి తిరిగి, "నేను ఇంకో బస్సు ఎక్కిస్తాలే-వూ, వూ-ఛార్జీలు నేనే యిస్తా-అందాక, మా వాళ్ల ఇంటికి వెడదాం" అన్నాడు. అల్లా పక్కసందులోకి, ఇంకా గొందుల్లోకి, మురికి గదుల్లోకి కిరాతకహస్తాలలోకి జారి జారి పడిపోయింది, అలమేలు. డబ్బులు దొరికాయి, తిండి దొరికింది, చీరెలు దొరికాయి, క్లిప్పులు, రిబ్బన్లు దొరికాయి. మామయ్య గారింటికి చేరనే లేదు. అమ్మ, నాన్నలకి ఆచూకీ తెలుపనే లేదు.

ఎందుకు? అయోమయంలో, భయంలో, అవమానంలో గడిచిపోతున్న బతుకు, ఎల్లా మలుపు తిప్పాలో తెలీదు.

సముద్రం వద్దున గోతుల్లో పడిపోయింది. ఎందుకో, ఎలాగో, ఎప్పుడో ఒక పిల్లవాడు పుట్టాడు. తన వృత్తిలో వాళ్లే ఆదుకున్నారు. పురుడు పోశారు. వీధి కుక్క బతుకైంది.

"ఎక్కడికి పోతావురే!" అన్నారు.

అదో కూటమి, అదో సంఘం, అదో స్నేహబృందం. దోపిడీ చేస్తున్న పురుషజనసందోహం.

సముద్రం, కనుపించే నీలాకాశం సాక్షులుగా, తలలూపి సన్నచప్పుడు చేసే సరుగుడు చెట్ల రోదనం నేపథ్యంగా, ఎండలో గోతిమట్టిలో కాలిపోతున్న అలమేలు వీపు సాక్షిగా వాస్తవం ఇదంతా. చేతిలో పడుతున్న నోట్లో కాగితాలు మాత్రమే ఒక పరమసత్యంగా బతుకు గడుస్తోంది, చరిత్ర నడుస్తోంది.

(ఇది వాస్తవగాథ)